ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 29 జూలై 2024

గుంతలమయంగా రహదారులు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు 8

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి 8

పల్లెల్లో స్థానిక సందడి

- ప్రభుత్వ నిర్ణయంతో ఆశావహుల్లో జోష్
- జనవరి 31తో ముగిసిన సర్పంచుల పదవీ కాలం
- కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన
- రిజర్వేషన్లపై సందిగ్ధం ఉన్నా ఏర్పాట్లపై దృష్టి
- ఓటరు జాబితా సవరణకు యత్నాలు
- జిల్లాలో 380 పంచాయతీలు...3,500 వార్డులు



జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియగా పంచాయతీ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే పంచాయతీ పోరు పూర్తి కావాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాను రూపొందించాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దీంతో అందరి దృష్టి గ్రామ పంచాయతీ ఎన్నికలపై పడింది. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. త్వరలో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల గడువు కూడా ముగియనుంది. 2023-24ను ఎలక్షన్ ఇయర్‌గా అటు అధికారులు, ఇటు రాజకీయ నాయకులు అభివర్ణిస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది అనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.

రంగంలోకి ఆశావహులు...

జిల్లాలో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఆ సామాజిక వర్గానికే రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన తెరపైకి వచ్చింది. బరిలో నిలిచేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా యువతరం ఈ సారి సర్పంచ్ బరిలో ఉండేందుకు ఉవ్విళ్లూరుతోంది. పార్టీల పరంగా సర్పంచ్ పదవిని ఆశించే వారంతా యాక్టివ్ అవుతున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడ గట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉప సర్పంచ్ పదవిని ఆశిస్తున్న నేతలు ప్యానల్స్ ఏర్పాటుపై దృష్టి సారించారు. వార్డుల వారీగా ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకొని తమకు అనుకూలంగా వ్యవహరించే నేతలను ఆయా వార్డుల్లో గెలిపించుకోవడానికి అనుగుణంగా పావులు కదుపుతున్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులను ఆశిస్తున్న నేతలు సైతం పల్లె రాజకీయాలపై దృష్టి సారించారు.

2019 జనవరిలో ఎన్నికలు...

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. జిల్లాలో మూడు విడతలుగా 380 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొదటి విడత 2019 జనవరి 21న జరగగా, రెండో విడత 2019 జనవరి 25న, మూడో విడత 2019 జనవరి 30న జరిగింది. మూడు విడ తలుగా ఎన్నికలు పూర్తి చేసిన అనంతరం ఫిబ్రవరి 2వ తేదీన పంచా యతీల్లో పాలకవర్గాలు ప్రమణ స్వీకారం చేసి కొలువుదీరాయి. 2024 ఫిబ్ర వరి 1వ తేదీతో ఐదేళ్లు కావడంతో వారి పదవీకాలం పూర్తయింది. నిబంధనల ప్రకారం పదవీకాలం పూర్తయ్యేలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల సంఘం అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ముందుకు రాలేదు. ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈనేపథ్యంలో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ప్రక్రియ షురూ...

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు, 3,500 వార్డులు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. వాటికి అదనంగా మరికొన్ని పోలింగ్ బూత్‌లు అవసరమవుతాయని అధికారులు భావి స్తున్నారు. ఇందుకోసం వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు బూత్‌లను ఏర్పాటు చేయగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వార్డుల ఆధారంగా పోలింగ్ స్టేషన్ల ను ఏర్పాటు చేయనున్నారు. అదనపు పోలింగ్ కేంద్రాలు, ఎంత మేర సిబ్బంది అవసరం వంటి వివరాలు సేకరిస్తున్నారు. ఓటర్లను వార్డుల వారీగా విభజించి ఎన్ని బూతులు అవసరం అనే దానిపై కసరత్తులు చేస్తున్నారు.

రిజర్వేషన్లపై రానున్న స్పష్టత..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారం బీసీ కమిషన్ ప రిధిలో ఉంది. గతంలో కూడా సుప్రీం కోర్టు బీసీ జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో వారిక అవకాశాలు కల్పించాలని సూచించింది. మ రోవైపు బీసీ కమిషన్ బీసీ రిజర్వేషన్లు తేలిస్తే వెంటనే ఎన్నికలు నిర్వహిం చడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. ఈ పరిస్థితు ల్లో బీసీ కమిషన్ బీసీ కులగణను చేసిన తదుపరి రిజర్వేషన్లను ప్రకటి స్తుందా..? లేదా పాత రిజర్వేషన్ల ప్రకారమే ఈ సారి ఎన్నికలు నిర్వహిం చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా...? అనేది ఈ నెలాఖరులోగా స్పష్టత వస్తుందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే...

దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి



పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేస్తాము. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని ప్రాథమికంగా సేకరిం చాము. జిల్లాలో పంచాయతీల సంఖ్య, వార్డుల వివరాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇతర సమాచారాన్ని సేకరించాము. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశించినా ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నాము.

పరిశుభ్రతను పాటించాలి


జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి



బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 28 : పట్టణంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల వివరాలు, భోజన శాలలోని బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు, మంచి నీరు, గదులు, బాత్‌రూమ్‌లను, బోర్ వంటి వాటిని పరిశీలించారు. వసతి గృహంలో 48మంది విద్యార్థులు ఉన్నందున భోజనశాల శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వహకులకు, బాత్ రూమ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని నిర్వహకురాలు శ్రీలతకు ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదే శించారు. ఈయన వెంటా మున్సిపల్ కమిషనర్ మోహన్, డీఈ నాగేశ్వర్ రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, శానిటర్ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీరు విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, నర్సయ్య, అశోక్, నిజాం, నరేష్, సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మైలారపు లింబాద్రి ఏకగ్రీవం



విజయసంకేతం చూపుతున్న లింబాద్రి

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షునిగా మైలారపు లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని ఆర్య వైశ్య సంఘం జిల్లా కార్యాలయంలో నూతన అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ జరగగా, ఒకే ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి ముక్తా శ్రీనివాస్ తెలిపారు. దీంతో మైలారపు లింబాద్రి ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రం ఆర్గనైజింగ్ సెక్రటరీగా, మెట్‌పల్లి మురళీ కృష్ణ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా లింబాద్రి వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో సంఘం జిల్లా అధ్యక్షుడిగా లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో ఆర్యవైశ్యులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. లింబాద్రి పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నికకు కృషి చేసిన జిల్లా సంఘ సభ్యులందరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా ఉండడం అభినందనీయం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6వ వార్డుకు చెందిన నిరుపేద మున్నూరు కాపు కుటుంబానికి సంఘం అండగా నిలబడి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పడాల రాజేశ్ కుటుంబానికి ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ. 21 వేలు ఆర్థిక సహాయాన్ని జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం, భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు ఒడ్నాల రాజశేఖర్, చిట్ల రమణ, మధుసూదన్, శీలం ప్రవీణ్, చీటీ లక్ష్మీ నారాయణ, సూర్య ప్రసాద్, ప్రతాప్, రాజన్న, శ్రీనివాస్, వెంకటి, అంజన్న, భూమేశ్, రమేశ్ పాల్గొన్నారు.



జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

పెన్షనర్లకు టీ ఉద్యోగుల జేఏసీ అండ

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు టీ ఉద్యోగుల జేఏసీ అండగా ఉంటుందని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాల్సిన అవసరముందన్నారు. నాలుగు కరువు భత్యాలు వెంటనే విడుదల చేయాలని, ఐఆర్‌ను 5 శాతం నుంచి 20 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీలు పాల్గొన్నారు.

మారథాన్ రన్‌లో జగిత్యాల కమిషనర్ ప్రతిభ



మారథాన్ రన్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

జగిత్యాల టౌన్, జూలై 28 :తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలోని రంగనాయక సాగర్ ప్రాంతంలో సిద్దిపేట పోలీసుల ఆధ్వర్యంలో మారథాన్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వేయి మందికి పైగా ఈ మారథాన్ రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య 21.1 కిలోమీటర్ల మార్థాన్ రన్‌ను రెండున్నర గంటల్లో పూర్తి చేసి తన ప్రతిభను చాటాడు. దీంతో నిర్వాహకులు రెండున్నర గంటల్లో పూర్తి చేసి ప్రతిభ చాటిన సమ్మయ్యను మెడల్‌తో సత్కరించారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి రోజూ వాకింగ్ చేయాలని కోరారు.

వైభవంగా గ్రామ దేవతలకు బోనాలు



నెత్తిన బోనంతో ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్



కోరుట్ల బోనాల శోభయాత్రలో పాల్గొన్న మహిళలు

జగిత్యాల టౌన్, జూలై 28 : జిల్లా కేంద్రంలో ఆషాడ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని పోచమ్మ తల్లి బోనాల పండుగను వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, మహిళల కోలాటాల మధ్య డీజే చప్పుళ్లతో బారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిని ఎత్తుకుని వేడుకల్లో పాల్గొన్నారు. చిలుకవాడ, ధరూర్ క్యాంపు, పురాణీ పేట ప్రాంతాల్లో ఉన్న పోచమ్మ తల్లి ఆలయాల్లో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి వేడుకల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణ ప్రజలు ఆదివారం గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. పట్టణంలోని ఐదు చేతుల పోచమ్మ, మహాలక్ష్మి, తాతమ్మ, పోచమ్మ, ఐలమ్మ, నల్ల పోచమ్మ, బద్ది పోచమ్మ, సారమ్మ, సారగమ్మ గ్రామ దేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పలు కుల సంఘాల అద్వర్యంలో వేడుకలను నిర్వహించగా సంఘ మహిళలు బోనాల శోభాయాత్ర నిర్వహించారు. పోతరాజులు నృత్యాలతో స్వాగతం పలికారు. మహిళలలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అయా కార్యక్రమాలలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ దేవతలకు గ్రామస్థులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో నల్ల పోచమ్మ తల్లిని గ్రామంలో ఉరేగించి గ్రామ శివారులోని మర్రి చెట్టు వద్ద ప్రతిష్టన చేశారు. పోచమ్మకు మహిళలు బోనాలను సర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్ని గ్రామంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలను నిర్వహించిన పోతరాజు కుల సంఘాల ఆద్వర్యంలో వేడుకలను నిర్వహించారు. గ్రామస్థుల అద్వర్యంలో వనబోజన కార్యక్రమాలను జరిపారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని గంగపుత్రుల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే గ్రామంలోని పోచ్చమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రతి ఆషాఢ మాసంలో గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి నీటి కొరత లేకుండా చెరువులు నిండి పంటలు బాగా పండాలని పోచమ్మను వేడుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనంను నెత్తిన ఎత్తుకోని బయలు దేరారు. గ్రామంలోని పూర వీధుల గుండా ఊరేగింపుగా భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో సంఘం అధ్యక్షుడు ధ్యావని పోచయ్య, మంచాల శివకుమార్, శంకర్, రాజేందర్, ఇంతయ్య, నాగరాజు, సత్యనారాయణ, ధర్మయ్య, మారుతి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: గ్రామ దేవత పోచమ్మ తల్లీ చల్లగా చూడాలని ప్రతి యేటా ఆషాడం మాసంలో నిర్వహించే బోనాల పండుగను గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పురవీధుల గుండా మహిళలు బోనాన్ని నెత్తిన ఎత్తుకొని ఆలయానికి బయలుదేరారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. బోనంతో ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య పరిశ్రమ అధ్యక్షుడు పర్రె శంకర్, గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు ఆర్మూర్ నరేందర్, పారిపెల్లి కిషన్, పర్మి నర్సయ్య, పారిపెల్లి శంకర్, మగ్గిడి సురేష్, కుడుముల సాయన్న, సాయిలు, మానుకల చిన్నయ్య, పారిపెల్లి రమేష్, రంజిత్, గంగారాం, శివ, దీపక్, కిషోర్, రాజు, మానుకాల పోచయ్య పాల్గొన్నారు.



బోనం ఎత్తుకుని వెళ్తున్న నాయకులు

అదృశ్యమైన తిరుపతి ఆచూకీ తెలుసుకుంటా

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



వృద్ధురాలిని ఓదార్చుతున్న ఎమ్మెల్సే జీవన్ రెడ్డి

బీర్‌పూర్,జులై 28: సౌదీలో అదృశ్యం అయిన తి రుపతి ఆచూకి తెలుసుకొనే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కందుల తిరుపతి సౌదీలో అదృశ్యం కాగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. జీవనోపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన తిరుపతి అక్కడ అదృశ్యమైనట్లు తెలిసి ఆందోళన చెం దారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తిరుపతి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విదేశాలలో ఉన్న అధికారులకు ఉత్తరాలు పంపి తిరుపతి ఆచూకి తెలుసుకొనే ప్రయత్నం చేస్తానని కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెరుపూరి సుభాష్ యాదవ్, ఉమ్మడి సారంగాపూర్ మండలం ఎన్నికల ప్రచారకమిటీ కన్వీనర్ జితేందర్‌యాదవ్, నాయకులు శేఖర్ ఉన్నారు.

●మండలంలోని ఆయా గ్రామాలలో పలువురి కుటుంబాలను ఆదివారం పట్టబధ్రుల ఎమ్మెల్సీ టీ. జీవన్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని కొల్వాయి గ్రామంలో గల వడ్డెర కాలనీకి చెందిన గంగాధర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను, కొల్వాయి గ్రామానికి చెందిన మేదరవేణి రాయమల్లు అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను, అదే గ్రామానికి చెందిన పసుల రమేష్ ఇటివల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రావ్ ఉన్నారు.

రు. 13 కోట్ల రోడ్ల నిర్మాణ పనులు రద్దు

- టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ దశలో నిలిపివేత
- మళ్లీ మంజూరు వచ్చేనా?
- వానాకాలంలో తప్పని కష్టాలు

కథలాపూర్, జూలై 28: గత సర్కారు పల్లె రోడ్లను మెరుగు పరచాలనే ఉద్దేశంతో మంజూరు చేసిన పనులు రద్దు కావడంతో గ్రామీణ జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న క్రమంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని వివిధ గ్రామాలను కలిపే రోడ్లకు నిధులు వెచ్చించింది. కాగా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు ఈ పనులను రద్దు చేయడంతో మళ్లీ నిధులు కేటాయిస్తారా అనే సందేహం వ్యక్తమవుతోంది.

● టెండర్లు పూర్తయినా...

మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వాన్నంగా మారగా స్థానిక ప్రజాప్రతినిధులు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తేవడంతో సుమారు. 13 కోట్ల నిధులు కేటాయించారు. భూషణరావుపేట-కథలాపూర్ డబుల్ రోడ్డుకు రు. 6 కోట్లు, చింతకుంట వయా గుంటి పెరమాళ్ళు నుంచి కథలాపూర్‌కు రు. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు రు. 2 కోట్లు, దూలూరు నుంచి పోసానిపేట రోడ్డుకు రూ. 3 కోట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాటు అగ్రిమెంట్ దశకు చేరుకోగా ఈ పనులను రద్దు చేసినట్లు తెలిసింది. ఎప్పటి నుంచో ఎదిరి చూస్తున్న భూషణరావుపేట-కథలాపూర్ రోడ్డు డబుల్ రోడ్డుగా మారుతుందని ఆశించినా నిష్ప్రయోజన మే అయింది. కాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక ఈ రోడ్ల నిర్మాణ పనులు ఎందుకు రద్దు చేశారనేది ప్రశ్నార్థకంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ రోడ్లు అధ్వాన్నంగా ఉండడంతో నరక ప్రయాణంగా ఉంది.



భూషణరావుపేట - కథలాపూర్ రోడ్డు

● నిధులు మళ్లీ మంజూరు చేయాలని కోరాం

- నాగం భూమయ్య, మాజీ జడ్పీటీసీ



మంజూరైన రోడ్ల నిధులను రద్దు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉంది. అనేక సార్లు ఈ రోడ్లకు నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వం దృష్టికి తెచ్చి మంజూరు చేయించాం. కాంట్రాక్టర్లు కూడా టెండర్లు వేసి పనులు చేపట్టడానికి ముందుకు వచ్చినా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు అవస్థలు తప్పలేవు. జనం పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తెచ్చాము. సానకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు.

భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

సిరిసిల్ల టౌన్, జూలై 28: భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందని ఓయూ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో మంద సుదర్శన్ అధ్యక్షతన 'దళితులు- సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడారు. భారత సమాజంలో మనుషులకు కులం ద్వారానే గుర్తింపు ఉంటుందన్నారు. దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దళిత ప్రజలు విస్తరించి ఉన్నారని, ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం దేశంలో 22 శాతం ఉన్నారని అన్నారు. వారి చేతుల్లో భూములు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా భూ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు.

ఉద్యమాలతో సాధించుకున్న కొందరు దళితులు మాత్రమే భూములను సాగు చేసుకొని జీవించారన్నారు. గత ప్రభుత్వం దళితులు సాగు చేసుకున్న భూములను అభివృద్ధి పేరిట బలవంతంగా లాగేసుకుందని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే దాదాపు 2120 ఎకరాల సాగు భూమిని దళితుల నుంచి దొరలు, భూస్వాములు ధరణి పేరుతో లాక్కున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాడు దళిత జాతి ప్రజల కోసం రాజకీయ హక్కులను సాధించారని, ఓటు హక్కుతోపాటు చట్ట సభలో దళిత ప్రజలు ప్రాతినిధ్యం వహించేందుకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. గత ప్రభుత్వం దళితుల నుంచి లాక్కున్న భూములను తిరిగి ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నేరెళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ న్యాయం చేయాలని కోరారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు అంకని భాను, మాజీ జడ్పీటీసీ గొట్టె రుక్మిణి, నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల తయారీపై సీఎం వ్యాఖ్యలు సరికాదు



దీక్షలో పాల్గొన్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, జూలై 28: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేయించకుండా గుజరాత్‌లోని సూరత్ నుంచి కొనుగోలు చేసి తెచ్చిందంటూ అసెంబ్లీలో నేతన్నలను అవమాన పరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో కూరుకపోయి ఏడు నెలలవుతోందని, పరిశ్రమలపై ఆధారపడినవారికి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఐదేళ్ల నుంచి ప్రభుత్వంపై ఆధారపడే వస్త్ర పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొన సాగించిన పథకాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజమన్నారు.

సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తి జరిగిందా? లేదా? అనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. బతుకమ్మచీరల తయారీలో అవినీతి జరిగితే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉత్పత్తి చేసిన నేతన్నల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని, వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను యజమానుల, ఆసాములు, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం దీక్షలో వైపని గౌరవ అధ్యక్షుడు ఒగ్గు గణేష్, ఆసాముల సంఘం ఉపాధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వెంగళ అంకయ్య, అంబటి రవీందర్, సందుపట్ల పోచమల్లు, తాటికొండ శ్రీనివాస్, బూర అంబరీషం కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పైనుంచి 20,643 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌లో నుంచి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో వర్షాలు కొనసాగుతూ ఉన్నాయి. ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 31.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వర్షాలకు చెరువులు కుంటలు నిండిపోగా, మానేరు హుస్సేనిమియా వాగులు ఉప్పొంగుతున్నాయి.

● 'గాయత్రి' నుంచి 12,600 క్యూసెక్కుల నీరు..



గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎస్సారెస్పీ మిడ్ మానేరుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం నాలుగు పంపుల ద్వారా విడుదల చేసిన నీటిని ఆదివారం కూడా అధికారులు కొనసాగించారు. ప్రస్తుతం 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలివెళ్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి ప్రవాహం కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. నాలుగు బహుబలి పంపులతో 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు రెండో రోజు కూడా కొనసాగించారు. కాగా గ్రావిటీ కెనాల్‌లో నీరు నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లల్లో ఆనందం కదలాడుతోంది.

● ఉధృతంగా ప్రవహిస్తున్న వరద కాలువ..



కురిక్యాల వద్ద ఉధృతంగా పారుతున్న వరద కాలువ

గంగాధర: వరద కాలువ ఎల్లంపల్లి నీటితో ఉధృతంగా పారుతోంది. రామడుగు మండలం లక్ష్మీపూర్ పంపుహౌస్ నుంచి అధికారులు నాలుగు మోటర్లు ప్రారంభించారు. ఒక్కొక్క పంపు నుంచి 3,150 క్యూసెక్కుల నీరును అధికారులు విడుదల చేయగా ఇప్పటివరకు ఒక్క టీఎంసీ నీరు మిడ్ మానేరుకు చేరినట్లు గంగాధర మండల పరిధిలో కాలువను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల్లో వరద కాలువ అంచులను తాకుతూ ఎల్లంపల్లి నీరు దిగువకు వెళుతోంది. వరద కాలువకు నీరు విడుదల చేయడంతో గంగాధర మండల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మల్యాల: ఎల్లంపల్లి నీటితో వరదకాలువ నిండుగా మారి జలకళను సంతరించుకుంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి రెండురోజులుగా మిడ్‌మానేరుకు వరదకాలువ ద్వారా నీటిని విడుదల చేయగా వరదకాలువ 102కి.మీ వద్ద గల షానగర్ క్రాస్‌రెగ్యులరేటర్ నుంచి రాంపూర్ పంప్‌హౌజ్ వైపు కూడా కొంత మేర నీరు వస్తుంది. దీనికి తోడు మిడ్‌మానేరు వద్ద కూడా నీరు పూర్తిస్థాయికి చేరుకుంటుండడంతో ఎగువకు ఎల్లంపల్లి జలాలు ఎగబాకుతున్నాయి. దీంతో రాంపూర్ పంప్‌హౌజ్ వద్దకు ఆదివారం ఉదయం వరకే వరదకాలువలో నీరు సమృద్ధిగా చేరుకున్నాయి. రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద గేట్లు వేసి ఉండడంతో నీరు ఇక్కడి వరకు నిలిచి ఉన్నాయి. వరదకాలువలోకి నీరు చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే మిడ్‌మానేరు నిండిన తరువాత శ్రీరాంసాగర్ వరకు నీటిని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వరదకాలువకు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

● మిడ్‌మానేరుకు 12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: బోయినపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి ఎల్లంపల్లి గ్రాయత్రి పంప్‌హౌజ్ ద్వారా 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్‌లో పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను 306.36 ఉండగా నీటి నిల్ల సామర్థ్యం 27.50 టీఎంసీలకు గాను 6.66 టీఎంసీల నీరు ఉంది.



మూలవాగులో కలుస్తున్న వరద కాలువ నీరు

ఆడుకుంటూ అనంత లోకాలకు..

- నీటి సంపులో పడి చిన్నారి మృతి

- గాజులపల్లిలో విషాదం



శ్రేయాన్స్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 28: ఇంటిలో సందడి చేసే ఓ పసివాడి చిరునవ్వులు అర్థాంతరంగా ఆగిపోయాయి.. అమ్మా అంటూ తప్పటడుగులు వేస్తూ ఇళ్లంతా కలియతిరిగే చిన్నారి అడుగులు నిలిచిపోయాయి. ఆడుకుం టూ వెళ్లిన ఆ చిన్నారిని విధి అక్కున చేర్చుకుంది. ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మూడేళ్ల చిన్నారి పెద్దోళ్ల శ్రేయాన్స్ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లిలో ఆదివారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని పెద్దోళ్ల అనూష -కిషన్ దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు శ్రేయాన్స్ ఉన్నారు. అనూష-కిషన్ దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. ఆదివారం సాయంత్రం తల్లి అనూష ఇంటిలో వంట పని చేస్తే, తండ్రి కిషన్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పిల్లలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు శ్రేయాన్స్ నీటి సంపులో పడిపోయాడు. కొడుకు కనిపించడం లేదని తల్లి ఇంటితో పాటు ఆరు బయట గాలించింది. అనంతరం తాగు నీటి సంపులో విగత జీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. విషయం తెలుసుకున్న తండ్రి కిషన్ చేరుకుని సంపులో నుంచి శ్రేయాన్స్‌ను బయటకు తీసి హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి చనిపోయాడని నిర్ధారించారు. కన్న కొడుకు అర్థాంతరంగా మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించారు. అయ్యో కొడుకు అప్పుడే నూరేళ్లు నిండాయా..? అంటూ తల్లి అనూష కంటతడి పెట్టడం అక్కడున్న పలువురు హృదయాలను కదిలించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నామని వివరించారు.

కొడుకు మృతిని తట్టుకోలేక.. తల్లి మృత్యువాత

- 15 రోజుల వ్యవధిలో తల్లీకొడుకు మృతి

మల్యాల, జూలై 28: కొడుకు మృతిని తట్టుకోలేని ఆ తల్లి తనయున్నే తలచుకుంటూ మృత్యువాతపడింది. ఈ విషాదకరమైన సంఘటన మల్యాల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. మల్యాలలోని బీసీ కాలనీకి చెందిన బెక్కం లక్ష్మణ్(24)అనే యువకుడు ఈ నెల 14 మొహర్రం వేడుకల్లో భాగంగా పులివేషధారణ వేసి తోటి మిత్రులతో వేడుకల్లో ఉండగానే అకస్మత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కొడుకు మృతిని తలచుకుంటూ తల్లి లక్ష్మి(50) మదనపడుతోంది. ఆ బాధ నుంచి తేరుకోలేక ఆదివారం లక్ష్మి కూడా మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. 15 రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలోని తల్లి, కొడుకులు మృతి చెందడం స్థానికంగా కలచివేస్తోంది.

● ఎమ్మెల్యే ఆర్థిక సాయం..

బెక్కం లక్ష్మి ఆదివారం మృతి చెందడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పంపించిన ఐదు వేల రూపాయ లను అందజేశారు. మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, ఆగంతపు వంశీ, శనిగారపు తిరుపతి, ప్రతాప్, హరినాథ్, ప్రశాంత్, ఇమామ్ ఉన్నారు

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని.. యువకుడి బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


కథలాపూర్, జూలై 28: తాను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందనే మనస్తాపానికి గురైన మాడవేని తిరుమలేశ్ (19) అనే యువకుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మండలంలోని సిరికొండకు చెందిన తిరుమలేశ్ కోరుట్లలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ యువతితో ప్రేమలో పడగా ఆమె వివాహం చేసుకోడానికి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుమలేశ్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆదివారం సిరికొండ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పెళ్లికి ఆర్థిక ఇబ్బందులతో యువతి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 28: పెళ్లికి అవసరమైన డబ్బులకు తల్లి, సోదరుడు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసి మనస్తాపానికి గురై కరీంనగర్‌లోని బోయవాడలో కోహూరి ధరణి(21) అనే యువతి శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ధరణికి తండ్రి లేడు. తల్లి, సోదరులు ఆమెకు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఒక యువకుడితో మూడు నెలల కిందట నిశ్చితార్థమైంది. అయితే పెళ్లి ఖర్చులకు కావాల్సిన డబ్బుల సర్దుబాటుకు ఇబ్బందికరంగా ఉందని తల్లి, కొడుకులు బాధపడుతున్న విషయం తెలుసుకున్న ధరణి ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

పెళ్లి ఖర్చుల డబ్బులు, ఏర్పాట్ల పనుల నిమిత్తం ధరణి తల్లి, సోదరుడు శనివారం ఉదయం పెద్దపల్లికి బంధువు ఇంటికి వెళ్లారు. రాత్రి ధరణికి తల్లి ఫోన్ చేయగా స్పందించక పోవటంతో వెంటనే సమీపంలో ఉన్న ధరణి స్నేహితురాలిని వెళ్లి చూడమన్నారు. ఆమె వెళ్లేసరికి ధరణి ఉరికి వేళాడుతూ కనిపించింది. స్థానికులు ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని వెల్లడించారు. పెళ్లికి డబ్బులు సర్దుబాటు అవ టం లేదని మనస్తాపంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి మాలతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 28: కరీంనగర్ బైపాస్‌రోడ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొంతినేని అభినయ్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన అభినయ్ నాలుగేళ్ళుగా కరీంనగర్‌లోని కాపువాడలో అద్దె గదిలో ఉంటూ ఒక కారు షోరూంలో టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో దాబాలో భోజనం చేసేందుకు బద్దం ఎల్లారెడ్డి విగ్రహం వద్ద నుంచి బైపాస్‌రోడ్‌లో తీగలవంతెన వైపు తన బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వర్షం కారణంగా, అతివేగంగా బైక్ నడపటంతో ఎల్‌పీజీ గ్యాస్ బంక్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా అభినయ్ స్ట్రీట్‌లైట్ పోల్‌కు ఢీకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..

రాయికల్, జూలై 28: రాయికల్ పట్టణంలోని అల్లెపు రాజశేఖర్(30) అనే వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ తన భార్యతో గొడవ పడగా భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన రాజశేఖర్ పట్టణ శివారులోని మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న అల్లెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి వరద



ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 28: ధర్మపురి వద్ద గోదావరి నది ఆదివారం ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా కడెం ప్రాజెక్టు నుంచి 4,682 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

బస్సు కిందకు దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

● ఇద్దరు యువకులకు గాయాలు

మల్యాల, జూలై 28: ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెలుతుండగా అదుపుతప్పి ఆర్టీసీ బస్సుకింద పడడంతో స్కూటీని వదిలి పక్కకు దూకడంతో యువకులు గాయాల పాలు కాగా స్కూటీ బస్సు కింద కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల-కరీంనగర్ రహదారి మార్గంలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల వద్ద జగిత్యాల నుంచి కొడిమ్యాలకు స్కూటీపై వెలుతున్న ఇద్దరు యువకులు ముందు గల కారును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న నిర్మల్ ఆర్టీసీ బస్సును గమనించలేదు. అయితే యువకులు చాకచక్యంగా ద్విచక్రవాహనం వదిలి పక్కకు దూకగా స్కూటీ వాహనం ఆర్టీసీ బస్సు కింద పడింది. ఆర్టీసీ బస్సు కింద పడడంతో



బస్సు కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

స్కూటీని లాక్కెళ్లింది. అయితే త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పగా గాయపడిన యువకులును చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని యువకుడి ఆత్మహత్య



వాసుదేవరెడ్డి(ఫైల్)

జనగామ రూరల్, జూలై 28: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిని జనగామ రైల్వే పోలీసులు గుర్తించారు. ముందుగా గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు రైల్వే పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఏనుగు వాసుదేవరెడ్డి(19) మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో బీటెక్ చదువుతు న్నాడు. ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

బీర్‌పూర్, జూలై 28: మండలంలోని తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన పొన్నం భూమన్నగౌడ్ ఆదివారం కొల్వాయి శివార్లలోని తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీదనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయానికి కొల్వాయి గ్రామంలో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గాయపడ్డా భూమన్న గౌడ్‌ను పరామర్శించి 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి తిరుపతి అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడగా అతని గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గాయపడ్డ తిరుపతిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ కరువు

- అత్యాచారాలు, హత్యలపై పోరాటానికి సిద్ధం కావాలి - పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

కళ్యాణ్‌నగర్, జూలై 28: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన పీవోడబ్ల్యూ ఏడో మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై హింస, మతోన్మాదం పెరిగిందని, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. బిల్కిస్ భానుపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని బీజేపీ సన్మానించిందని విమర్శించారు. దేశంలో రాజ్యాంగానికి విరుద్ధంగా సీఏఏ, ఎన్‌ఆర్‌సీ పౌర చట్టాలను తీసుకువచ్చి మతోన్మాదంతో వ్యవహరిస్తుందన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస చట్టాల కోసం పీవోడబ్ల్యూ బలమైన పోరాటం చేస్తుందని, మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చేసినా అది అమలు కావడం లేదని ఆరోపించారు. హక్కుల కోసం మహిళలు పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించగలుగుతామన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధిలో ఉన్నా పని ప్రదేశాల్లో లైంగిక దాడులను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

● ర్యాలీ నిర్వహించిన మహిళలు..

పీవోడబ్ల్యూ మహాసభ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు కే జ్యోతి ఆధ్వర్యంలో



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి లక్ష్మీనగర్, అశోక్‌నగర్ మీదుగా ఐఎఫ్‌టీయూ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో జెండా ఆవిష్కరించి సభలను నిర్వహించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాళ్లు బుచ్చమ్మ, మంగ, రజిత, అమృత, సరోజన, శారద, స్వర్ణలత, స్వప్న, పద్మ, సత్తెమ్మ, ఐ కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 20,370 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,370 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 32.657 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 624 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 26.805 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.408 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

హుజూరాబాద్, జూలై 28: హుజూరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక నివేదికలు చదివి వినిపించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సభ్యులు సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్‌పాషా, ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ గోపాల్‌రావు, కోశాధికారి దుర్గాజీ, కొంరెల్లి, సత్యనారాయణ, గణపతిరెడ్డి, చారుదత్తు, రవీందర్, కాంతమ్మ, జయవర్ధన్, లక్ష్మినారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో భర్తీకి నోచుకోని సింగరేణి కోటా సీట్లు

- ● ఉద్యోగుల పిల్లలు అనాసక్తి
- ● ప్రత్యామ్నాయ మార్గం లేక మిగిలిపోతున్న సీట్లు
- ● పదేళ్లుగా ఇదే తంతు - పట్టించుకోని అధికారులు
- ● సింగరేణి ప్రభావిత గ్రామాల విద్యార్థులకు చోటు కల్పించాలని డిమాండ్

రామగిరి, జూలై 28: సింగరేణి నిధులతో నిర్మాణం జరిగిన మంథని జేఎన్టీయూలో సింగరేణి కోటాలో కేటాయించిన ఇంజనీరింగ్ సీట్లు భర్తీకి నోచుకోవడం లేదు. జేఎన్టీయూ కళాశాల నిర్మాణానికి పూర్తి సహకారం అందించిన సింగరేణి సంస్థకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ సీట్లలో ఐదు శాతం సీట్లు సంస్థ ఉద్యోగులకు కేటాయించింది. అందులో భాగంగా ఆరు బ్యాచ్‌లు కల్గిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సూపర్ న్యూమరరీ కోటా కింద 18 సీట్లు ఉద్యోగుల పిల్లలకు అవకాశం కల్పించింది. కాగా 2021-22 వరకు ఐదు శాతం ఉన్న కోటాను 2022-23 విద్యా సంవత్సరానికి 10 శాతం పెంచింది. దాంతో ఇప్పటి వరకు 18గా ఉన్నా సీట్ల సంఖ్య 36కు పెరిగింది. కానీ పెరిగిన సంఖ్యకు అనుగుణంగా సింగరేణి ఉద్యోగుల పిల్లల నుంచి ఆశించిన మేర దరఖాస్తులు రావడం లేదు. దీంతో గడిచిన పదేళ్లుగా సూపర్ న్యూమరరీ సీట్లు మిగిలి పోతూనే ఉన్నాయి. ఇక నాలుగు సంవత్సరాల కౌన్సెలింగ్ వివరాలను పరిశీలిస్తే 2021-22లో సివిల్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానికల్, సీఎస్ఈ, మైనింగ్, సీఎస్ఈ(ఏఐ) విభాగాల ఒక్కో విభాగానికి మూడు సీట్లా చొప్పున 18 సీట్లు కేటాయించగా 13 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఐదు సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి. అదేవిధంగా 2022-23 విద్యాసంవత్సరంలో



కోటాను 10శాతానికి పెంచగా ఒక్కో విభాగంలో ఆరు సీట్ల చొప్పున 36 సీట్లు కేటాయించగా అందులో 26 సీట్లలో విద్యార్థులు చేరగా 10 సీట్లు మిగిలిపోయాయి. 2023-24 విద్యాసంవత్సరానికి గాను కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే సీట్లను ఎంపిక చేసుకోవడంతో 24 సీట్లు అలాగే ఉండిపోయాయి. ఇక ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి 36 సీట్లకు గాను 11 సీట్లు మాత్రమే విద్యార్థులు ఎంపిక చేసుకోగా 25 సీట్లు మిగిలిపోయాయి. సింగరేణి కోటా సూపర్ న్యూమరరీలో 36 సీట్లకు గాను 18 సీట్లు అధికారుల పిల్లలకు, 18 సీట్లు కార్మికుల పిల్లలకు కేటాయించగా ప్రస్తుతం అధికారుల పిల్లలు కేవలం తొమ్మిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా కార్మికుల పిల్లలు 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అధికారుల పిల్లలు ఇద్దరు, కార్మికుల పిల్లలు తొమ్మిది మంది కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లను భర్తీ చేయగా 25 సీట్లు మిగిలిపోయాయి. తిరిగి రెండో కౌన్సెలింగ్ నిర్వహించినా ఇదే అధికారుల పిల్లలు, కార్మికుల పిల్లలు 36 మందిలో భర్తీ అయిన 11 మంది పోనూ మిగతా 25 మందిలో నుంచే కౌన్సెలింగ్‌కు హాజరు కావల్సి ఉంటుంది. అందులో నుంచి ఇప్పటికే వివిధ కళాశాలలో చేరి ఉండడంతో ఆ 25 సీట్లు మిగిలి పోయే అవకాశం ఉంది.

● ప్రభావిత గ్రామాల విద్యార్థులకు కేటాయించాలి..

మంథని జేఎన్టీయూ కళాశాలలో పది సంవత్సరాలుగా బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతున్న సూపర్ న్యూమరరీ సింగరేణి కోటా సీట్లలో ప్రభావిత గ్రామాల విద్యార్థులకు అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. సంస్థ కోసం ప్రత్యేక్షంగా, పరోక్షంగా అండగా ఉంటూ తమ భూములను దారాదత్తం చేసిన తమకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో సింగరేణి విఫలం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలలో బ్యాక్‌లాగ్‌లుగా మిగులుతున్న సీట్ల విషయంలోనైనా శ్రద్ధ వహించి ప్రభావిత గ్రామాలకు చెందిన విద్యార్థులకు జేఎన్టీయూలో అవకాశం కల్పించి సింగరేణి కోటాలో ప్రభావిత గ్రామాల విద్యార్థులను చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

● యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం..

గడిచిన పదేళ్ళుగా సింగరేణి కోటా సీట్లు ప్రతి సంవత్సరం మిగిలిపోతున్న దానికి ప్రత్యామ్నయ మర్గాలు అన్వేషించకుండా వర్సిటి అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారు. సూపర్ న్యూమరరీ కోటాలో మిగిలిపోయిన సీట్లను బ్యాక్‌లాగ్‌లుగా వదిలివేయకుండా జనరల్ కౌన్సిలింగ్‌లో చేర్చినట్లైయితే సామాన్య విద్యార్థులకు లబ్ధి జరిగే అవకాశం ఉంది. దీనికి ప్రత్యేకమైన జీవోలు కాని ప్రభుత్వం నుండి అనుమతులు కాని అవసరం లేకున్నా కేవలం వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రతిష్టాత్మకమైన కళాశాలలో సీట్లు బ్యాక్‌లాగ్ గానే మిగిలిపోతున్నాయి.

గుంతలమయంగా రహదారులు

● వర్షాలకు చిత్తడిగా మారిన రోడ్లు.. ● వాహనదారులకు తప్పని ఇక్కట్లు.. ● పట్టించుకోవాలని గ్రామస్థుల వేడుకోలు



గుంతలమయంగా మారిన మొగిలిపేట రహదారి

మల్లాపూర్, జూలై 25 : వారం రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులకు తిప్పలు తెచ్చి పెడుతున్నాయి. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామ ప్రధాన రహదారిని ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం చేయడంతో అడుగడుగునా గోతులతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాలకు పూర్తిగా రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొగిలిపేట గ్రామం మీదుగా నిర్మల్ జిల్లాకు వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సైతం అవస్థలు పడుతున్నారు. ఆర్టీసికి ప్రధాన ఆదాయంగా మారిన మెట్‌పల్లి, ఖానాపూర్ గ్రామాల మధ్య నిర్మల్ జిల్లా, మెట్‌పల్లి బస్సు డిపోలకు సంబంధించిన బస్సులు పదుల సంఖ్యలో నిత్యం నడుస్తాయి. దీంతో ఇరు జిల్లాలకు రవాణ మార్గం మొగిలిపేట గ్రామ రహదారి ప్రధానంగా మారింది. గోతుల పడ్డ రహదారిపై ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో ఇటీవల అధికారులు గుంతల్లో మట్టిని పోయించారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా వర్షాలకు మట్టి బురదగా మారి మరింత అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

అధ్వానంగా కొడిమ్యాల-నాచుపల్లి ప్రధాన రోడ్డు

కొడిమ్యాల : పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జ్‌కు ఇరువైపుల ఉన్న రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నల్లగొండ గ్రామ శివారులో నల్లగొండ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం మధ్య ప్రధాన రోడ్డుపె గుంతలు ఏర్పడి నీరు నిలిచింది. దీంతో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకున్న భక్తులు, మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దర్శనం చేసుకొని కొండగట్టు అంజన్న దర్శనానికి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జ్ పక్కన ఉన్న బురద రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు నిత్యం వ్యసాయ పనులకు ఇతర గ్రామాలకు, జిల్లా కేంద్రానికి వెల్లాలంటె ఇదె రోడ్డుపై వచ్చి పోతుంటారు. పలువురు ద్విచక్ర వాహనదారులు వాహనాలు అదుపు తప్పి బురదలో పడినట్లు కొడిమ్యాల గ్రామస్తులు తెలిపారు. అధికారులు బ్రిడ్జ్ పక్కన రోడ్డును పూర్తి స్థాయిలో చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బురద రోడ్డుతో ఒడ్డెర కాలనీవాసుల అవస్థలు

భీమారం: గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని మారుమూల గ్రామమైన ఒడ్యాడ్ గ్రామంలోని ఒడ్డెర కాలనీలోని రోడ్డు నడవడానికి కూడా ఇబ్బందిగా తయారైంది. ఈ కాలనీలో సుమారు 30 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. ఇదే రోడ్డుగుండా గ్రామంలోని మంది రైతులు తమ పంట పొలాలకు వెళ్తుంటారు. అలాగే గ్రామంలోని సబ్‌స్టేషన్ నృసింహ స్వామి ఆలయం, ఎల్లమ్మ, మల్లన్న ఆలయాలు, పెద్దమ్మ ఆలయాలకు వెళ్లే దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో కాలనీవాసులు తమ సొంత డబ్బులతో



కొడిమ్యాలలో బ్రిడ్జ్ పక్కన బురదమయంగా మారిన రోడ్డు



ఒడ్డెర కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు

తాత్కాలిక మరమ్మతులు చేయించినా ఫలితం లేకుండాపోయింది. అలాగే ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు బురదమయంగా ఉండటంతో జారి పడిన దాఖలాలు కూడా అనేకం. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డును బాగు చేయించి మమ్మల్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు, కాలనీవాసులు వేడుకుంటున్నారు.

ఇబ్బందిగా ఉంది..

బత్తుల ఆశీర్వాదం, కాలనీవాసుడు



మా కాలనీ నుంచి గ్రామంలోకి బురదతో ఉన్న దారిలో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. మా గురించి పట్టించుకునేవారే లేరు. మా ఇంటికి వచ్చిన బంధువులను ట్రాక్టర్‌పై తీసుకువెళ్లి గ్రామంలోని బస్టాండ్ వద్దకు పంపించిన పరిస్థితి మాది. ప్రజాప్రతినిధులు పట్టించుకుని రోడ్డు బాగు చేయించాలి.

మా పిల్లలను స్కూల్‌కు పంపడం లేదు..

పల్లపు లక్ష్మి, కాలనీవాసురాలు



ఈ రోడ్డులో నడవడానికి మేమే ఇబ్బందులు పడుతున్నాం. అలాంటిది మా పిల్లలను వర్షం పడుతున్నప్పటి నుంచి స్కూల్‌కు పంపడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు మా గురించి ఆలోచించి శాశ్వత రోడ్డు వేయించాలని కోరుతున్నాం. అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు

పెగడపల్లి, జూలై 28 : ప్రతి ఉద్యోగికి తన ఉద్యోగ జీవితంలో ఉద్యోగ పదవీ విరమణ తప్పనిసరి అని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు పేర్కొన్నారు. మండలంలోని రాజారాంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నర్నేని రమేష్ రావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావుతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగికి తన ఉద్యోగ జీవితంలో చేసిన సేవలకు గుర్తింపు ఉద్యోగ విరమణ రోజు చేసిన సత్కారాల తోనే లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎలుగు మునీందర్, ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ఆసుపత్రిలో వైద్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి రూరల్, జూలై, 28 : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వైద్యులకు సూచించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు రాపర్తి హర్ష, అడెపు గణేష్‌లను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదివారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

నిరుపేదలకు అండగా రాములపల్లి వాట్సాప్ గ్రూప్

పెగడపల్లి, జూలై 28 : గ్రామంలోని నిరుపేదలకు అండగా నిలుస్తూ ఇతర గ్రామాల వాట్సాప్ గ్రూప్ సభ్యులకు ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్ సభ్యులు. గ్రామంలో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తమవంతు సాయం చేయాలనే మంచి మనస్సుతో తలా కొంత పోగు చేసి వాటితో బాధిత కుటంబానికి అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు రాములపల్లి యువకులు. గ్రామంలోని కార్తాతపు మల్లేశం దురదృష్టవశాత్తు కింద పడి తొంటి బాగంలో విరగగా వాట్సాప్ గ్రూప్ ద్వారా అదే గ్రామానికి చెందిన దీకొండ మహేందర్ మల్లేశం కష్టాల కడలి జీవితం గూర్చి సందేశం పోస్టు చేయగా దాతలు స్పందించి రూ. 21 వేల 500 పంపించగా ఆయనకు అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ అమిరిశెట్టి లక్ష్మినారాయణ, మాజీ ఎంపీటీసీ కడారి సుప్రియ తిరుపతి, పత్తెం మల్లేశం, కట్ల శ్రీనివాస్, పుల్కం మల్లేశం, బుర్ర శ్రీనివాస్, చంద్రయ్య మురళి పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి

బీజేపీ సీనియర్ నాయకుడు గంగారెడ్డి



మెట్‌పల్లిలో మోదీ ప్రసంగాన్ని వీక్షించిస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి, జూలై, 28 : ప్రధానమంత్రి మంత్రి నరేంద్రమోదీ తలపెట్టిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీపల్లె గంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాయలంలో మోదీ ప్రసంగాన్ని టీవీలో నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో విజయాలు సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. చేతి వృత్తులు, కళావృత్తులు ప్రోత్సహించడానికి ఖాదీ వస్త్రాలు వాడాలన్నారు. డ్రగ్స్ నిర్మూలించేందుకు యువకులకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి సంబంధించిన వారిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, సదాశివ్, యాదగిరిబాబు, శ్రీనివాస్, విజయ్, రమేష్‌యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హాస్టళ్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



ధర్మపురి హాస్టల్ వద్ద మొరం పోయిస్తున్న మున్సిపల్ కమిషనర్

ధర్మపురి, జూలై 28: ధర్మపురి పట్టణంలోని పలు హాస్టల్స్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ, ఎస్టీ బాలుర, బాలికల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాల, జ్యోతి బాపులే గురుకుల డిగ్రీ కళాశాల హాస్టల్స్‌ను అధికారులు పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలు శుభ్రం చేయించారు. చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు తీయించి మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడరం చల్లించారు. బాత్ రూమ్‌లను పారిశుధ్య సిబ్బందిచే శుభ్రంగా కడిగించారు. వర్షాకాలంలో హాస్టల్స్ ముందు ఏర్పడిన గుంతల్లో మట్టి పోయించి చదును చేయించారు. జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించారు. వంట గదులను పరిశీలించి నాణ్యత కలిగి ఉన్న పదార్థాలు వాడాలని సూచించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, వార్డు ఆఫీసర్స్ ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందంతో వినియోగదారులకు గుదిబండ

● **మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి**

కథలాపూర్, జూలై 28 : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని కేంద్రంతో రేవంత్‌రెడ్డి సర్కారు చేసుకున్న ఒప్పందం వినియోగదారులకు గుదిబండగా మారనుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతం నుంచీ కేసీఆర్ చెబుతూనే వస్తున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెడతారని అది నిజం కాబోతోందన్నారు. ఎఫ్‌ఆర్‌బీఎం రాయితీ వర్తిస్తే కేంద్రం నుంచి రు. 30 వేల కోట్లు అప్పు పొందడానికి వీలుంటుందని అందుకు తలొగ్గిన రేవంత్‌రెడ్డి బీఆర్ ఎస్‌పై అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరమన్నారు. గతంలో ఆ రు.30 వేల కోట్ల నష్టాన్ని రాష్ట్రమే భరించిందని గుర్తు చేశారు.

ఈ ఒప్పందంతో సుమారు కోటి మందిపై మోయలేని భారం పడుతుందని, ఉద్యోగులకు కూడా నష్టం జరగనుందన్నారు. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డి మాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సర్వాపూర్‌లో ఆయిల్‌బాల్స్ వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మల్యాల, జూలై 28: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలను నివా రించవచ్చునని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధన్యం ఇవ్వాలని డిప్యూటి డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సర్వాపూర్‌లో మురుగుకాలువలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని, ఇంటి ఆవరణలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు

రాయికల్: పాఠశాల, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని రాయికల్ ఎంపీడీవో చిరంజీవి అన్నారు. రాయికల్ మండలంలోని పలు సంక్షేమ హాస్టళ్లను ఆదివారం ఎంపీడీవో చిరంజీవి తనిఖీ చేశారు. మండలంలోని అల్లీపూర్‌లో గల మహాత్మ గాంధీ జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాల, ఒడ్డెలింగాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల, రాయికల్‌లోని బీసీ, ఎస్సీ హాస్టల్‌లను సందర్శించి సిబ్బంది, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టళ్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఇటిక్యాల మోడల్ స్కూల్, జగన్నాథ్‌పూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో ఎంపీవో సుష్మా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కేజీబీవీ ప్రత్యేకాధికారి, హాస్టల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మాతా శిశుసంరక్షణ అధికారి ముస్కుజైపాల్‌రెడ్డి ప్రజలకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో డెంగీ కేసు నమోదుకావడంతో బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. కాలనీల్లో మురికికాలువలు, ఇళ్లను పరిశీలించి నిల్వఉన్న నీటిలోని చెత్తను తొలగించారు. అనంతరం ఉచితవైద్య శిబిరం నిర్వహించి ఫాగింగ్ చేశారు. ఈసందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ డెంగీవ్యాధి బారినపడిన వారు వైద్యుల సూచనలు పాటిస్తూ మందులువాడి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అన్ మ్యానెడ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఎంకు ఎమ్మెల్సీ లేఖ

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న అన్ మ్యానెడ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి లేఖను రాశారు. 2013 సంవత్సరంలో విద్యుత్ శాఖలో సుమారు 1,607 మంది ఐటీఐ అర్హత కలిగిన యువకులను అన్ మ్యానెడ్ కార్మికులుగా నియామకం చేశా రని తెలిపారు. ప్రస్తుతం సంబంధిత కార్మికుల్లో 1,553 మంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విద్యుత్ సరాఫరాలో అంతరాయం లేకుండా, విద్యుత్ సమస్యలు సత్వర పరిష్కారంలో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ బ్రేక్ డౌన్, 11 కేవీ, 33 కేవీ లైన్లలో లోపాలు సవరిస్తూ, లూజ్ వైర్లు సరిచేస్తూ, చెట్ల కొమ్మలు కొట్టేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేవలం రూ. 11,731 వేతనం చెల్లిస్తుండగా, చాలీ చాలని వేతనాలతో కార్మికులు దుర్భర జీవింతం గడుపుతున్నారన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గొల్లపల్లి, జూలై 28 : గొల్లపల్లి ఆదర్శ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కలకోట శ్రీజ అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి సుకుల సైన్స్ ప్రోగ్రామ్ పోటీ లకు ఎంపికైంది. ఇటివల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తన ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30న హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటిల్లో శ్రీజ పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటిల్లో విజేతగా నిలి చిన విద్యార్థులను జపాన్ దేశంలో జరిగే సుకుర సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లభిస్తుందని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జూలై, 28 : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నియోజక వర్గంలోని ప్రజలు, అధికారుల అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. ఆదివారం ఒక ప్రకటన ద్వారా ప్రజలు, అధికారులకు సందేశం ఇచ్చారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజుల అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. కురుస్తున్న వానాలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారుల శానిటేషన్ చర్యలు చేపట్టాలని, డ్రైడేను నిర్వహించాలని, తాగు నీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

కోరుట్ల, జూలై 28 : పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ అగ్రికల్చర్ ఉమెన్స్ కళాశాల, వెటర్నరీ కాలేజీలోని వసతి గృహం, పాలిటెక్నిక్ కళాశాలలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ఆదివారం కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలు, కళాశాలను పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. కిచెన్, బాత్రూంలు, తాగు నీరును పరిశీలన జరిపారు. విద్యార్థులు అంటువ్యాదులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గురుకుల పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు

మెట్‌పల్లి రూరల్, జూలై, 28 : మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను ఆదివారం పంచాయతీ కార్యదర్శి ఆసీఫ్ తొలగింప చేయించారు. ఇటివల మూడు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ' సమస్యల వలయంలో పెద్దాపూర్ గురుకులం' అనే కథనానికి స్పందించారు. పాఠశాలలోని గదుల మధ్య ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు, విషపు పురుగులు రావడంతో విద్యార్థులు ప్రాణాలకు రక్షణ లేకుండ పోయింది. పాఠశాలలో జరిగిన ఘటనతో విద్యార్థులు భయంతో ఇంటి వెళ్లి పోయారు. అధికారలు విద్యార్థులకు రక్షణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి దగ్గర ఉండి పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కోరుట్ల, జూలై 28 : పట్టణంలోని సిదార్థ ఉన్నత పాఠశాలలో 2008-2009 పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళ నంగా ఏర్పడ్డారు. పట్టణంలోని సీనారే కళ్యాణ భవనంలో అపూర్వ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలు నేమరవేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాభోదన చేసిన ఉపాధ్యాయలను సన్మానించి అభినందించా రు. ప్రస్తుతం వారు చేస్తున్న వ్యాపార ఉద్యోగాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ కలిసి ఒకేచోట భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మెట్‌పల్లిలోని శ్రీనివాస్ గురుకుల పాఠశాలలో పదోవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులంతా అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డారు. ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని విదిత్‌రెడ్డి గార్డెన్‌లో పాఠశాలలోని 2003-04 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులు, జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని గడిపారు. నాటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు నరేష్, మహేందర్, సంజీవ్, అనిల్, భార్గవి, సుమలత, శిరీష, నవిత పాల్గొన్నారు.





కోరుట్ల, మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాంగ్రెస్ నేతను పరామర్శించిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, జూలై 28: ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్దా లక్ష్మణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటం వల్ల ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. గాయపడిన లక్ష్మణ్ హైదరాబాద్‌లో గల ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు.

అమర వీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎండపల్లి, జూలై28: తెలంగాణ ఉద్యమం కోసం అమరవీరులైన కుటుంబాలకి, తెలంగాణ ఉద్యమ కారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమ కారుల కో ఆర్డినేటర్ గాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం రోజున మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో పీఎస్ఆర్ సర్కిల్ వద్ద ఉద్యమ కారుల రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉద్యమ కారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కారులకు ఇంటి స్థలంతో పాటు, పెన్షన్, గుర్తింపు కార్డు ఇచ్చి అమర వీరుల కుటుంబాలని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాడి విజయ, తరాల విజయ ముద్ద మనమ్మ, నడిమెట్ల సత్యావతి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

కోరుట్ల, జూలై 28 : పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబానికి జైహనుమాన్ దీక్ష సేవా సమితి సభ్యులు ఆర్థిక చేయూతను అందించారు. పట్టణానికి చెందిన ఇందూరి నర్సింహచారి కొన్ని రోజుల క్రితం మృతి చెందగా అతని కుటుంబకు సేవా సమితి సభ్యులు అర్థిక చేయూతను అందించారు. జై హనుమాన్ దీక్ష సేవా సమితి సభ్యులు రూ. 50 వేల బ్యాంక్ ఫిక్స్ డిపాజిట్‌ను అతని కుటుంబ సభ్యులకు అందించారు. అదే విధంగా ఇంటి అవసరాల నిమిత్తం వంట సామగ్రి అయిన బియ్యం, పప్పులు అందజేసి కుటుంబకు అండంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గజం శంకర్, జంగం అనిల్, బాలే మహేష్, మూడపల్లి శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాఠశాల రహదారి నిర్మాణ పనులు చేపట్టాలి

జగిత్యాలరూరల్, జూలై 28 : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాట్లాడుతూ కండ్లపల్లి గ్రామంలో ఉన్న మోడల్‌స్కూల్ రహదారి పూర్తిగా బుర దమయమై దెబ్బతిందని, ఈ రహదారి వెంట పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవ తీసుకొని రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సరుగు శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి కిసతీష్, ఉపాధ్యక్షుడు సురేందర్, నియోజకవర్గ కో-ఇన్‌చార్జి సునీల్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు

బీర్‌పూర్, జూలై 28: మండలంలోని మంగేళ, చిత్రవేణిగూడెం గ్రామాలలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆదివారం ఎంపీడీవో లచ్చాలు, ఎంపీఓ రామకృష్ణ రాజులు పరిశీలించారు. రెండు రోజుల క్రితం జి ల్లాలోని గురుకుల పాఠశాలలో బాలుడు మృతి మరో విద్యార్థికి విషపురుగు కాటు వేయడం లాంటి సంఘట నల కారణంగా జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మంగేళలోని బాలికల గిరిజన పాఠశాలను ఎంపీడీవో లచ్చాలు పరిశీలించి షనిటేషన్ చేయించారు. అదేవిధంగా చిత్రవేణిగూడెంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీవో రామక్రిష్ణ రాజు పరిశీలించి మురికి కాలువలు శభ్రం చేయించి బ్లిచింగ్ వేయించారు. విద్యార్థుల గదులు, వంట శాలల శుభ్రత తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హస్టల్ ప్రిన్సిపాల్‌లు శ్రీనివాస్, మాలతి, కార్యదర్శులు రవి, లివిన్ ఉన్నారు.